జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## భద్రాద్రి కొత్తగూడెం
గురువారం | 30 | ఏప్రిల్ | 2026 | పేజీలు : 8

## ధాన్యం కొనుగోలు కేంద్రాలపై కలెక్టర్ అంకిత్ ఆకస్మిక తనిఖీలు

- రైతులకు ఇబ్బందులు లేకుండా పారదర్శక కొనుగోలు ప్రక్రియకు ఆదేశాలు



**అన్నపురెడ్డిపల్లి, ఏప్రిల్ 29, ప్రజాజ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండలంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం ఆకస్మికంగా సందర్శించి, అక్కడ జరుగుతున్న కొనుగోలు ప్రక్రియను సమగ్రంగా పరిశీలించారు. కేంద్రంలో రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా స్వీకరిస్తున్నారా అనే విషయంపై ప్రత్యేకంగా దృష్టి సారించి, సంబంధిత అధికారులను వివిధ అంశాలపై ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ధాన్యంలో

మిగతా 2 లో...



# సంస్థాగత సందడి

6 లో..

- పార్టీ పటిష్టతపై కాంగ్రెస్, బీఆర్ఎస్ దృష్టి
- అనుభవజ్ఞులకు ప్రాధాన్యత కోరుతున్న కాంగ్రెస్ శ్రేణులు
- అందరినీ కలుపుకొని ముందుకెళ్తున్న బీఆర్ఎస్





భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి సంస్థాగత బలోపేతంపై దృష్టి సారిస్తున్నాయి. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయాలని రెండు పార్టీలూ వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్నాయి. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు, పరిషత్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని క్షేత్రస్థాయిలో పార్టీని చురుకుగా మార్చేందుకు నాయకత్వాలు చర్యలు చేపడుతున్నాయి.

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

## ఏజెన్సీ యువతకు ఉపాధి దిశగా "గిరిదర్శక్" కార్యక్రమం

- కొంగరకలాన్‌లో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభం
- పాల్గొన్న జిల్లా పోలీసు అధికారి రోహిత్ రాజు



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 29, ప్రజాజ్యోతి:** ములుగు జిల్లాలను కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ప్రత్యేక దృష్టి జిల్లాలుగా గుర్తించిన నేపథ్యంలో, గతంలో మావోయిస్టుల ప్రభావం అధికంగా ఉన్న ఏజెన్సీ ప్రాంతాల యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలను చేపడుతోంది. ఈ క్రమంలో మంగళవారం కొంగరకలాన్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నిర్వహించిన అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా "గిరిదర్శక్" కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసు అధికారి రోహిత్ రాజు పాల్గొన్నారు. భద్రాచలం, పర్ణశాల, కిన్నెరసాని వంటి ఆధ్యాత్మిక, సహజసిద్ధమైన పర్యాటక ప్రాంతాలు కలిగిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే పద్దెనిమిది నుంచి ముప్పై ఐదు సంవత్సరాల మధ్య వయస్సు గల యువతను గుర్తించి, వారికి ప్రత్యేక శిక్షణ అందించి పర్యాటక ప్రాంతాల్లో మార్గదర్శకులుగా నియమించడమే "గిరిదర్శక్" కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని

మిగతా 2 లో...

## తల్లి ప్రేమ వలె అంగన్వాడీల ఆలన

- అంగన్వాడి బలోపేతానికి సర్కార్ కృషి
- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



## అడవే ఆధారం... ఆదివాసీల జీవనాధారం..

- సహజ సంపదతో అడవిపుత్రుల స్వయం ఉపాధి
- గిరిజనుల జీవితాల్లో విప్ప పువ్వు వెలుగులు..
- ఐటిడిఎతో గిరిజనుల అభివృద్ధికి చేయూత



**చర్ల, ఏప్రిల్ 29:(ప్రజాజ్యోతి):** ఎండలు మండుతున్నా అడవి బిడ్డల కళ్ళలో మాత్రం ఆనందం విరబూస్తోంది. చర్ల మండలంలోని ఏజెన్సీ గ్రామాల్లో ఇప్పుడు ఎక్కడ చూసినా విప్ప పువ్వుల పరిమళమే. తెల్లవారుజామునే గిరిజన కుటుంబాలు అడవి బాట పడుతున్నాయి. రాలి పడిన విప్ప పువ్వులను ఏరుకుంటూ వాటిని ఎండబెట్టి విక్రయించడం ద్వారా తమ ఆర్థిక స్థితిగతులను మార్చుకుంటున్నారు. గిరిజనులకు విప్ప పువ్వు కేవలం ఒక పువ్వు మాత్రమే కాదు, అది వారి ఆర్థిక అవసరాలను తీర్చే బంగారం. ఈ పూలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉండటంతో స్థానిక వ్యాపారులు, సహకార సంఘాలు మంచి ధరకు కొనుగోలు చేస్తున్నారు. ఒక కుటుంబం ఈ సీజన్ లో వేల రూపాయల వరకు సంపాదించే అవకాశం ఉంటుంది. ఈ ఆదాయం ద్వారా గిరిజన కుటుంబాలు రోజువారీ ఖర్చులు, పిల్లల చదువు, ఆరోగ్య

మిగతా 2 లో...

## ధాన్యం కొనుగోలు కేంద్రాలపై కలెక్టర్ అంకిత్ ఆకస్మిక తనిఖీలు





(మొదటి పేజీ తరువాయి...)

తేమ శాతాన్ని నిర్ధారించడానికి ఉపయోగిస్తున్న మాయిశ్చర్ కొలిచే యంత్రం పనితీరును పరిశీలించారు. తేమ శాతం నిర్ధారణలో ఎలాంటి లోపాలు లేకుండా ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని ఆలస్యం లేకుండా పరీక్షించి వెంటనే కొనుగోలు ప్రక్రియ కొనసాగించాలని అధికారులకు ఆదేశించారు. రైస్ మిల్లులకు ధాన్యం ట్యాగింగ్ విధానం, కొనుగోలు రిజిస్టర్ల నిర్వహణ, టోకెన్ పంపిణీ వ్యవస్థపై సమగ్ర సమాచారం సేకరించారు. టోకెన్లను సమయానికి జారీ చేసి రైతులు అనవసరంగా వేచి ఉండకుండా చూడాలని, ప్రతి రైతుకు పారదర్శకంగా సేవలు అందించాలని తెలిపారు. కొనుగోలు కేంద్రంలో రికార్డుల నిర్వహణ ఖచ్చితంగా ఉండాలని అధికారులకు సూచించారు.ప్రభుత్వం రైతులకు మద్దతుగా చేపట్టిన ధాన్యం కొనుగోలు కార్యక్రమాన్ని సమర్ధవంతంగా అమలు చేసి, ప్రతి రైతు లాభపడేలా చూడటం అధికారుల బాధ్యత అని కలెక్టర్ స్పష్టం చేశారు.అనంతరం పెంట్ల గ్రామంలో ఇందిరమ్మ ఇల్లును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ స్వర్ణ, ఎంపిడిఓ మహాలక్ష్మి , ఎంపీఓ షబానా, మండల వ్యవసాయ అధికారి అనూష తదితరులు పాల్గొన్నారు.

## తల్లి ప్రేమ వలె అంగన్వాడీల ఆలన



**గుండాల. మార్చి 29. ప్రజా జ్యోతి.** అంగన్వాడీల బలోపేతానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడారు . అంగన్వాడి కార్యకర్తలు పిల్లలను తల్లి ప్రేమ వలె చూస్తున్నారని, వారి కృషి అమోఘమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల బడుగు బలహీన వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని వారి ప్రయోజనాల కోసం పనిచేస్తుందని అన్నారు బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తుందని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగంగా నడుస్తున్నాయని విడతలవారీగా గృహాలు అందిస్తున్నామన్నారు పేదలు ఇందిరమ్మ ఇళ్లను అందంగా నిర్మించుకుంటున్నారని వారి కల కాంగ్రెస్ ప్రభుత్వం వల్లనే నెరవేరింది అన్నారు 60 మంది అంగన్వాడి కార్యకర్తలకు స్మార్ట్ ఫోన్ పంపిణీ చేశారు దీని ద్వారా డిజిటల్ సేవలు అందుబాటులోకి వస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు 14 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో సిడిపిఓ మంగతార, ఇల్లందు డి.ఎస్.పి వెంకన్న బాబు, తాసిల్దార్ ఖాసీం, ఎంపీడీవో బాలరాజు, గుండాల సీఐ తిరుపతి, ఎంఈఓ పార్వతమ్మ, పంచాయతీరాజ్ డిఇ రామనాథం, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ముత్తయ్య, ఖదీర్, మండలనాయకులు బొంగు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# అడవే ఆధారం... ఆదివాసీల జీవనాధారం..





(మొదటి పేజీ తరువాయి...)

అవసరాలు తీర్చుకుంటున్నారు.ఇలా విప్ప పూల సేకరణ గిరిజనులకు స్థిరమైన ఉపాధిని అందిస్తూ వారి ఆర్థిక స్థితిని మెరుగుపరుస్తోంది.తెలంగాణ రాష్ట్ర గిరిజన సహకార సంస్థ ద్వారా ప్రభుత్వం గిరిజనులకు మద్దతు ధర కల్పిస్తోంది.మద్దతు ధర దళారుల దోపిడీకి గురికాకుండా ప్రభుత్వం మద్దతు ధరను ప్రకటించి నేరుగా కొనుగోలు కేంద్రాల ద్వారా పువ్వులను సేకరిస్తోంది.విలువ ఆధారిత ఉత్పత్తులు కేవలం పువ్వులు అమ్మడమే కాకుండా, వాటితో విప్ప లడ్డూలు, బిస్కెట్లు, నూనె తయారీపై గిరిజన మహిళలకు ప్రభుత్వం శిక్షణ ఇస్తోంది. దీనివల్ల మారుమూల గ్రామాల మహిళా సంఘాలకు కొత్త ఉపాధి మార్గాలు లభిస్తున్నాయి.విప్ప పువ్వులో ఐరన్, కాల్షియం విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. గిరిజనులు దీనిని ఆహారంలో భాగంగా తీసుకుంటారు. రక్తహీనతతో బాధపడే గర్భిణీలకు ఈ విప్ప పువ్వుతో చేసిన లడ్డూలు అమృతంలా పనిచేస్తాయని వైద్య నిపుణులు సైతం ధృవీకరిస్తున్నారు. అడవుల్లో విరబూసిన ఈ విప్ప సిరులు గిరిజన జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయి. ప్రభుత్వం మరిన్ని ప్రాసెసింగ్ యూనిట్లను స్థానికంగా ఏర్పాటు చేస్తే ఈ 'అటవీ సిరి' గిరిజనులను మరింత ఉన్నత స్థితికి చేరుస్తుందనడంలో సందేహం లేదు. ఐటీడీఏ భద్రాచలం ప్రాజెక్ట్ అధికారులు గిరిజనుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి పలు అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నారు .భద్రాచలంలో ఏర్పాటు చేసిన 'భద్రాద్రి మార్ట్' ద్వారా గిరిజనులు సేకరించిన అటవీ ఉత్పత్తులకు విప్ప పువ్వు, తేనె, కరక్కాయలు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు.

విప్ప పువ్వు సేకరణ ఇతర చిన్న తరహా పరిశ్రమల కోసం గిరిజన యువతకు మహిళా సంఘాలకు రాయితీతో కూడిన రుణాలను అందిస్తున్నారు. విప్ప పువ్వులో ఐరన్ విటమిన్లు ఎక్కువగా ఉండటం వల్ల, దీనిని ఐటీడీఏ ఆధ్వర్యంలో నడిచే ఆశ్రమ పాఠశాలలు అంగన్ వాడీల్లో పోషకాహారంగా పంపిణీ చేసేలా గిరిజనుల రూపొందిస్తున్నారు. గతంలో విప్ప పువ్వు అమ్ముకోవడానికి చాలా ఇబ్బంది పడేవాళ్ళం అని ఇప్పుడు ఐటీడీఏ వారు శిక్షణ ఇవ్వడం, జీసీసీ సెంటర్లలో కొనుగోలు చేయడంతో మాకు చేతినిండా పని తగిన ఆదాయం లభిస్తోంది అని గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.అటవీ సంపదను కాపాడుకుంటూనే ఆధునిక సాంకేతికతను జోడించి గిరిజనుల జీవన ప్రమాణాలను పెంచడంలో ఐటిడిఏ చేస్తున్న కృషి అడవుల్లో నివసించే గిరిజన గ్రామాల్లో కొత్త వెలుగులు నింపుతోంది.

## ఏజెన్సీ యువతకు ఉపాధి దిశగా “గిరిదర్శక్” కార్యక్రమం

(మొదటి పేజీ తరువాయి...)

రోహిత్ రాజు తెలిపారు.మొదటి విడతలో భాగంగా పది మంది యువకులను ఎంపిక చేసి, వారికి ఇరవై ఒకటి నుంచి ఇరవై ఎనిమిది రోజుల పాటు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణలో జిల్లాలోని పర్యాటక ప్రదేశాలపై అవగాహన, సందర్శకులతో మాట్లాడే తీరు, ప్రకృతి మరియు వన్యప్రాణులపై జ్ఞానం, ప్రథమ చికిత్స వంటి అంశాలను బోధించనున్నట్లు వెల్లడించారు. అటవీ, దేవాదాయ, పర్యాటక మరియు గిరిజనాభివృద్ధి శాఖల సమన్వయంతో పోలీసు శాఖ ఈ అభ్యర్థులను ఎంపిక చేస్తోందని తెలిపారు. గిరిజన గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, మాట్లాడే నైపుణ్యం, ఆత్మవిశ్వాసం, స్థానిక పరిజ్ఞానం ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేసి వారికి తగిన శిక్షణ అందించనున్నట్లు చెప్పారు.శిక్షణ పూర్తిచేసుకున్న అభ్యర్థులకు వేతనంతో కూడిన ఉపాధి కల్పిస్తూ, జిల్లాలోని వివిధ పర్యాటక ప్రాంతాల్లో నియమించనున్నట్లు వెల్లడించారు.ఇప్పటివరకు అభివృద్ధికి దూరంగా ఉన్న ఏజెన్సీ ప్రాంత ప్రజలను ప్రధాన అభివృద్ధి ప్రవాహంలోకి తీసుకురావడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఇతర శాఖల సమన్వయంతో పోలీసు శాఖ పలు అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. వినూత్నంగా చేపడుతున్న “గిరిదర్శక్” కార్యక్రమం ద్వారా గిరిజన యువతకు మంచి భవిష్యత్తు ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



# పదో తరగతి ఫలితాల్లో భద్రాచలం శ్రీ చైతన్య సత్తా

- **రాష్ట్ర స్థాయిలో మెరిసిన విద్యార్థులు**
- **ఆనందోత్సాహాల్లో పాఠశాల కుటుంబం**



**భద్రాచలం, ఏప్రిల్ 29, ప్రజాజ్యోతి:** తెలంగాణ పదో తరగతి వార్షిక పరీక్షల ఫలితాల్లో భద్రాచలం శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి ఘన విజయాన్ని నమోదు చేశారు. అత్యున్నత మార్కులతో విద్యార్థులు మెరిసి పాఠశాలకు ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చారు. పాఠశాలకు చెందిన మనస్వి అక్షయ 600 మార్కులకు గాను 575 మార్కులు సాధించి ప్రతిభ చాటగా, శ్రీ సాయి చరణ్ 574 మార్కులు, వెంకట సాయి రామ్ మోహన్ 570 మార్కులు సాధించి పాఠశాల ఖ్యాతిని మరింత పెంచారు. అలాగే పలువురు విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించి విజయపథంలో నిలిచారు. విద్యార్థుల కష్టపడి చదవడం, ఉపాధ్యాయుల నిరంతర మార్గదర్శకత్వం, తల్లిదండ్రుల ప్రోత్సాహం కలిసి ఈ విజయాలకు కారణమయ్యాయని పాఠశాల యాజమాన్యం పేర్కొంది.విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు ప్రత్యేక అధ్యయన ప్రణాళికలు, అదనపు తరగతులు, క్రమశిక్షణతో కూడిన బోధన విధానం అమలు చేస్తున్నామని తెలిపారు. ఫలితాలు వెలువడిన వెంటనే పాఠశాలలో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి.విద్యార్థులు, ఉపాధ్యాయులు పరస్పరం మిఠాయిలు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. ఈ సందర్భంగా కొత్తగూడెం జోన్ ఏజీఎం జయప్రకాష్, హైస్కూల్ కోఆర్డినేటర్ పెంచల బాబు, పాఠశాల ప్రిన్సిపల్ గోపాల్, డీన్ వెంకట కృష్ణ, సీ ఇన్‌చార్జ్ అజయ్ మాట్లాడుతూ విద్యార్థుల విజయంపై హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో కూడా ఇదే పట్టుదలతో ముందుకు సాగి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు. నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థులలో ఆత్మవిశ్వాసం, పోటీ తత్వం, విలువలు పెంపొందించే దిశగా పాఠశాల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని యాజమాన్యం తెలిపింది. రానున్న రోజుల్లో కూడా మరిన్ని అద్భుత ఫలితాలు సాధించి భద్రాచలం ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# రైతుముంగిట 22 ధాన్యం కొనుగోలు కేంద్రాలు

- పెనగడపలో ప్రారంభించిన ఎమ్మెల్యే కూనంనేని



**కొత్తగూడెం, ఏప్రిల్ 29 ( ప్రజాజ్యోతి )** నియోజకవర్గంలో రైతులకు ఊరట కలిగించేలా 22 ధాన్యం కొనుగోలు కేంద్రాలు మంజూరయ్యాయని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. బుధవారం చుంచుపల్లి మండలం పెనగడప గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి గింజను ఐకేపీ ద్వారా కొనుగోలు చేస్తామని దళారులను నమ్మి తక్కువ ధరకు విక్రయించవద్దని సూచించారు. తూకంలో పారదర్శకత పాటించాలని తేమ శాతం పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దని అధికారులకు ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద తాగునీరు, నీడ వంటి కనీస వసతులు కల్పించాలని చెల్లింపులు సకాలంలో రైతుల ఖాతాల్లో జమయ్యేలా పర్యవేక్షణ చేయాలని తెలిపారు. రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా, కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, ఎంపిడివో శుభాషిణి, తహసీల్దార్ నాగరాజు, సర్పంచ్ కారం సీతారాములు, ఉప సర్పంచ్ గోరె బాబు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సలిగంటి శ్రీనివాస్, వాసిరెడ్డి మురళి, నాయకులు నీడలా సుధాకర్, కుంచం కుమార్, కట్ట సత్యనారాయణ, మేఘనాధం, తాజుద్దీన్, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మార్జీ నారాయణ విద్యార్థుల ప్రతిభ



**ఇల్లందు, ఏప్రిల్ 29, ప్రజాజ్యోతి:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం విడుదలైన పదవ తరగతి ఫలితాలు పట్టణంలోని ఎమ్మార్జీ నారాయణ హై స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. యండి రహీమ్ 532/600, డి లహరి 512/600, కె నిఖిల్ 510/600, బి సృజన్ 505/600, ఎన్ తేజస్వి 494/600, యం హరిణి 479/600, యం కమల్ 464/600, బి మారుతీ 454/600, నాగ చైతన్య 444/600, ఏ క్యాతిక్ 438/600, ఎన్ హరి చరణ్ 406/ 600, సిహెచ్ జస్వంత్ 405/600, పి అబిష్ట 382/600, పి సిద్ధార్థ 379/600, బి సిద్దు 376/600, బి ధనుష్ 359/600 మార్కులు సాధించడం జరిగిందని పాఠశాల ప్రిన్సిపాల్ ఒంగూరి శ్రీనివాసరావు తెలిపారు. 16 మంది విద్యార్థులకు గాను 16 మందికి పాసై 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. సాధారణ విద్యార్థులతో అసాధారణ ఫలితాలు సాధించడం జరిగిందన్నారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులను అభినందించారు.

## త్రివేణి పాఠశాలలో పదవ తరగతి పరీక్ష ఫలితాల ప్రభంజనం




**భద్రాచలం టౌన్, ఏప్రిల్ 29, ప్రజాజ్యోతి,** త్రివేణి పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న కె.దర్శిని 579/600 మార్కులతో భద్రాచలం డివిజన్ టాప్ ప్లేస్ లో నిలిచింది. అదేవిధంగా పి. హర్షిణీప్రియ 574/600, కె.మనోహర్ రెడ్డి 572/600, జిపిల్.అక్షయ 570/600 మరియు వి. సాయి సిరి 570/600 వంటి టాప్ మార్కులతో అగ్రస్థానంలో నిలిచారు. త్రివేణి పాఠశాలలో మొత్తం పదవ తరగతి విద్యార్థులు 82 మందికి గాను 51 మందికి పైగా 500 మార్కులతో విజయ డంకా మోగించారు. ఈ సందర్భంగా త్రివేణి స్కూల్ ప్రిన్సిపాల్ నిరుపమ మాట్లాడుతూ భద్రాచలం పట్టణంలోని పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో టాప్ ప్లేస్ లో నిలవటానికి సహకరించిన తల్లిదండ్రులకు మరియు బోధనా సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా ఇంత అత్యధిక శాతం మార్కులు సాధించిన విద్యార్థిని విద్యార్థులందరకి శుభాశీస్సులు అందించారు .త్రివేణి పాఠశాలలో ప్రతి సంవత్సరం పదవ తరగతి పరీక్ష ఫలితాలలో వారి యొక్క సత్తా చాటుతున్నందుకు ,ఈ ఘనవిజయానికి చక్కటి ప్రణాళికను రూపొందిస్తున్న యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏవో బాబురావు, వైస్ ప్రిన్సిపాల్ విమల, అకాడమిక్ ఇన్చార్జి నరేష్, క్యాంపస్ ఇన్చార్జి సురేష్, సందీప్, తల్లిదండ్రులు పాల్గొని విద్యార్థిని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

## 10 ఫలితాలలో మార్గదర్శిని ప్రభంజనం



**ఇల్లందు, ఏప్రిల్ 29, ప్రజాజ్యోతి:** రాష్ట్రవ్యాప్తంగా బుధవారం విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో పట్టణంలోని మార్గదర్శిని గ్రూప్ ఆఫ్ స్కూల్స్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. జి.రిషిత 574/600 మార్కులు సాధించడం జరిగింది. అదేవిదంగా 30 మంది విద్యార్థులు 500 లకు పైగా మార్కులు సాధించారు. మార్గదర్శిని గ్రూప్ ఆఫ్ స్కూల్స్ లలో విద్యార్థుల పట్ల నిరంతరం శ్రద్ధ వహిస్తూ, చదువులో వెనకబడిన వారిని ప్రోత్సహిస్తూ ముందుకు సాగడం వల్లనే అత్యుంజయ ఫలితాలు రావడానికి కారణం. ఇంతటి ఘన విజయాన్ని సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు పాఠశాల కరస్పాండెంట్ దమ్మలపాటి వెంకటేశ్వరరావు, డైరెక్టర్లు యాదగిరి రాంబాబు, అర్వపల్లి రాధాకృష్ణ, పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలిపారు.

## భద్రాద్రి రామయ్యను దర్శించుకున్న కర్ణాటక గనుల శాఖ మంత్రి మల్లికార్జున్



**భద్రాచలం టౌన్, ఏప్రిల్ 29, ప్రజాజ్యోతి,** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారిని కర్ణాటక రాష్ట్ర గనుల శాఖ మంత్రి మల్లికార్జున్ బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అలాగే లక్ష్మీతాయారు అమ్మవారిని, ఆంజనేయస్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారుమంత్రి మల్లికార్జున్‌కు వేద పండితులు వేద ఆశీర్వచనం అందజేశారు. అలాగే దేవస్థానం తరపున తీర్థప్రసాదాలు అందించారు.

## ప్రజల అవసరాలతో వ్యాపారం చేస్తున్నారు

- బ్లాక్ మార్కెట్ కు తరలుతున్న పెట్రోల్, డీజిల్
- కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఇంధన సమస్యను తక్షణమే పరిష్కరించాలి...
- గోకినేపల్లి ప్రభాకర్ సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పాల్వంచ డివిజన్ కార్యదర్శి



**అశ్వారావుపేట, ఏప్రిల్ 29, ప్రజాజ్యోతి :** ప్రజల అత్యవసర అవసరాలను దృష్టి లో పెట్టుకోకుండా కొంతమంది వ్యాపారులు ఇంధనాన్ని బ్లాక్ మార్కెట్ కు తరలిస్తూ అక్రమంగా విక్రయిస్తున్నారని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ పాల్వంచ డివిజన్ కార్యదర్శి గోకినేపల్లి ప్రభాకర్ ఆరోపించారు. పెట్రోల్, డీజిల్ కొరతను సృష్టించి అధిక ధరలకు అమ్ముతూ ప్రజలను దోచుకుంటున్నారని ఆయన విమర్శించారు. బుధవారం పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడు తూ, గ్రామీణ ప్రాంతాల్లో ఇంధన లభ్యత తగ్గిపోవడంతో రైతులు, రవాణా రంగానికి చెందిన వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ నియంత్రణ లోపం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని అన్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి ఇంధన సరఫరాను సక్రమంగా పర్యవేక్షించాలని, బ్లాక్ మార్కెట్‌ను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశా రు. అలాగే బాధ్యులపై కఠిన శిక్షలు విధించాలని కోరారు. ప్రజలకు అందుబాటు లో సరైన ధరలకు పెట్రోల్, డీజిల్ అందేలా చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

## ఇంటర్లో ప్రతిభ చాటిన విద్యార్థినికి నగదు పురస్కారం అందజేత

- శ్రీరామ లయన్ క్లబ్ ఆధ్వర్యంలో సన్మానం



**భద్రాచలం టౌన్, ఏప్రిల్ 29, ప్రజాజ్యోతి,** భద్రాచలంకు చెందిన సత్తిబాబు, సుబ్బలక్ష్మి దంపతుల కుమార్తె జ్యోష్న ఇటీవల వెలువడిన ఇంటర్ ఫలితాల్లో 1000 మార్కులకు గాను 997 మార్కులు సాధించింది. దీంతో ఆమెను బుధవారం భద్రాచలం జీవన్ ఆసుపత్రి, శ్రీరామ లయన్స్ క్లబ్ సభ్యులు డాక్టర్ స్పందన రూ.10,000 నగదు పురస్కారం అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ స్పందన మాట్లాడుతూ జ్యోష్న మంచి వైద్యురాలిగా రాణించి ఏజెన్సీ ప్రాంతంలో మంచి వైద్యం అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు చల్లగుళ్ళ నాగేశ్వరరావు, కోశాధికారి భరత్‌కుమార్, సత్తిబాబు, సుబ్బలక్ష్మి, ప్రసాద్ పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి కౌన్సిలర్ ఆర్థిక సహాయం




**ఇల్లందు, ఏప్రిల్ 29, ప్రజాజ్యోతి:** పట్టణంలోని కొత్త కాలనీ 13వ వార్డుకు చెందిన పగడాల కృష్ణమూర్తి (72) వడదెబ్బతో బుధవారం ఉదయం మృతి చెందారు. విషయం తెలుసుకున్న 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్య మృతుని కుటుంబానికి అంత్యక్రియల నిమిత్తం రూ. పదివేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అదేవిధంగా పగడాల కృష్ణమూర్తి మృతికి సంతాపం తెలియజేస్తూ, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

## హిందూ సమ్మేళనం నిర్వహణపై నేడు మీడియా సమావేశం

**భద్రాచలం టౌన్, ఏప్రిల్ 29, ప్రజా జ్యోతి:** భద్రాచలం పట్టణంలో గత మూడు దశాబ్దాలుగా నిర్వహిస్తున్న "హిందూ సమ్మేళనం" మహాసభ నిర్వహణకు సంబంధించి గురువారం మీడియా సమావేశం నిర్వహించనున్నట్లు హిందూ సమ్మేళనం ఉత్సవ కమిటీ సభ్యులు పాకాల దుర్గా ప్రసాద్ తెలిపారు. ఈ సమావేశం ఉదయం 10 గంటలకు భద్రాచలం పట్టణంలోని తెలంగాణ టూరిజం హోటల్ లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. హిందూ సమ్మేళనం కార్యక్రమాల నిర్వహణ, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలు, రానున్న కార్యక్రమాలపై మీడియా ప్రతినిధులకు వివరాలు తెలియజేయనున్నట్లు వెల్లడించారు. మే 3, 2026న నిర్వహించనున్న భారీ బైక్ ర్యాలీ, సభ ఏర్పాట్లకు సంబంధించిన అంశాలను కూడా సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి మీడియా ప్రతినిధులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని హిందూ సమ్మేళనం ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు.

## ఉమ్మడి ఖమ్మం జిల్లా గిరిజన గురుకులాల్లో సత్తా చాటిన పది విద్యార్థులు

- 98.37 శాతం ఉత్తీర్ణత
- ఐదు గురుకుల్లో నూరు శాతం ఫలితాలు
- 500లకు పైగా మార్కులు సాధించిన 37 మంది విద్యార్థులు




**భద్రాచలం టౌన్ , ఏప్రిల్ 29 , ప్రజాజ్యోతి** భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని ఉడి ఖమ్మం జిల్లాలో ఉన్న 11 గిరిజన గురుకులాలతో పాటు ఖమ్మంలోని స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సీలోని పదో తరగతి గిరిజన విద్యార్ధిని, విద్యార్థులు పరీక్షల్లో తమ సత్తా చాటారు. మొత్తం 859 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 845 మంది ఉత్తీర్ణులయ్యారు. కేవలం 14 మంది మాత్రమే పరీక్షలు తప్పారు. మొత్తంగా 98.37 శాతం ఉత్తీర్ణత సాధించారు. కాగా గత ఏడాది 97.17 శాతం ఉత్తీర్ణత రాగా ఈసారి మరింతగా ఉత్తీర్ణత పెరిగింది. అలాగే వైరా ఆర్జేసీ, దమ్మపేట, సింగరేణి, తిరుమలాయపాలెం, ఖమ్మం స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సీల్లో నూరు శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. అలాగే ఖమ్మం ఎస్వోఈకి చెందిన సిద్ధం రాణా 583 మార్కులు, మణితేజ 579 గణేష్ 574 మార్కులు సాధించగా వైరా ఆర్జేసీకి చెందిన దరావత్ దీక్షశ్రీ 567, దుగ్గిరాల అలేఖ్య 564 మార్కులు సాధించారు. అలాగే భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని గురుకులాల్లో చదివే 37 మంది విద్యార్థులు 500లకు పైగా మార్కులు సాధించారు.

## మే 1న బిఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశం

- ఆకోజు సునీల్ కుమార్



**భద్రాచలం టౌన్, ఏప్రిల్ 29, ప్రజా జ్యోతి:** భారత రాష్ట్ర సమితి పార్టీ ఆధ్వర్యం లో మే 1వ తేదీన దుమ్ముగూడెం మండలం లక్ష్మీనగరం గ్రామంలో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు బిఆర్ఎస్ మండల నాయకులు ఆకోజు సునీల్ కుమార్ తెలిపారు. ఈ సమావేశాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.ఈ సమావేశానికి మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, పినపాక మాజీ శాసన సభ్యులు రేగా కాంతారావు, భద్రాచలం నియోజకవర్గ పార్టీ నాయకులు రావులపల్లి రాంప్రసాద్, మానే రామకృష్ణ తదితరులు హాజరుకానున్నట్లు వెల్లడించారు.రానున్న పరిషత్ ఎన్నికల్లో పార్టీని మరింత బలోపేతం చేయడం, గ్రామ స్థాయిలో పార్టీ కార్యకలాపాలను విస్తరించడం, అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలు, నాలుగు వందల ఇరవై హామీల అమలుపై ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాట కార్యాచరణ రూపొందించేందుకు ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.సమావేశానికి ముందు భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భద్రాచలం కొత్త మార్కెట్‌లోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం నుంచి ఉదయం తొమ్మిది గంటలకు ర్యాలీ ప్రారంభమవుతుందని తెలిపారు. పార్టీ అభిమానులు, కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆకోజు సునీల్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

## అక్రమ ఇసుక రవాణాను కట్టడి చేయండి



**బూర్గంపహాడ్, ఏప్రిల్ 29 (ప్రజా జ్యోతి ):** మండలంలో జరుగుతున్న అక్రమ ఇసుక రవాణాను కట్టడి చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు పున్నంచంద్ అధికారులను కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో కిన్నెరసాని వాగు ఇసుక అక్రమ రవాణాకు అడ్డాగా మారిందని, ఇసుక అక్రమ రవాణాపై రెవెన్యూ, పోలీసుశాఖ అధికారులు కొరడా ఝుళిపించాలన్నారు. అధికారులు అప్పుడప్పుడు మొక్కుబడిగా ఒకటి, రెండు ట్రాక్టర్లను పట్టుకుని కేసులు నమోదు చేస్తున్నామని చెబుతూ సాయంత్రం వేళల్లో ఆ ట్రాక్టర్లను వదిలివేయడం జరుగుతుందని, జిల్లా స్థాయి అధికారులు అక్రమ ఇసుక రవాణాపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా అక్రమ ఇసుక రవాణాను మండలంలో కట్టడి చేయాలని బూర్గంపహాడ్ సర్పంచ్ మందా నాగరాజు, బద్ర నాగమణిలు వేర్వేరుగా ఎస్సై మేడా ప్రసాద్, తహశీల్దార్ కేఆర్ కే ప్రసాద్ లకు వినతిపత్రాలు సైతం అందజేశారు.

## ఘనంగా ప్రారంభమైన శ్రీయోగానంద లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు





- ఉత్సవాలకు అంకురార్పణ నిర్వహణ
- స్వామి వారికి సహస్ర ధారాభిషేకం

**భద్రాచలం టౌన్ , ఏప్రిల్ 29 , ప్రజాజ్యోతి**

భద్రాచలంలో శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలుత బ్రహ్మోత్సవాలకు గోదావరి నుంచి తీర్థబిందెను తీసుకొచ్చి అంకురార్పణ నిర్వహించారు. అనంతరం బ్రహ్మోత్సవాల్లో పాల్గొనే రుత్వికులు పొడిచేటి రామస్వరూప్, రామాలయ ప్రధాన అర్చకులు విజయరాఘవన్, వేణుగోపాలాచార్యులకు దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావు దంపతులు నూతన వస్త్రాలను అందజేశారు. అనంతరం అంతరాలయంలో స్వామి వారికి అభిషేకం, విశ్వక్సేనార్చన, పుణ్యాహావచనం, ఉత్సవాంగ స్నపనం నిర్వహించారు. అలాగే స్వామి వారికి సహస్రధారాభిషేకం నిర్వహించారు. గురువారం నాడు బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిత్య హోమాలు, ధ్వజారోహణం, అగ్ని ప్రతిష్ఠ, ఎదుర్కోలు నిర్వహించనున్నారు. అలాగే మే ఒకటిన కల్యాణం, 2న రథోత్సవం జరగనుంది.

## ధాన్యం కొనుగోలు కేంద్రంలో తరుగుల వివాదం

- అభ్యంతరాలను పట్టించుకోకుండా రైతులను వేధిస్తున్నారు
- నిబంధనలు నచ్చకపోతే ధాన్యాన్ని ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముకోమన్న అధికారి
- ఆగ్రహించి ఆందోళనకు దిగిన రైతులు, కొనుగోలు కేంద్రంలో ఉద్రిక్తత
- ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించిన మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్



**అశ్వారావుపేట, ఏప్రిల్ 29, ప్రజాజ్యోతి :** నియోజకవర్గ కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో తరుగుల విషయంలో వివాదం నెలకొంది. కేంద్రంలో ధాన్యం విక్రయానికి వచ్చిన రైతులు తరుగులు 5కేజీ లు తీస్తున్నారని, దానికి తోడు ముఠా కూలీ కూడా అదనంగా చెల్లించాల్సి వస్తుందని ఆరోపిస్తూ ఆందోళన వ్యక్తం చేశారు. 5 కేజీలు తరుగు తీయడం వల్ల తమకు ఎకరానికి సుమారు 5 వేల వరకు నష్టం వాటిల్లుతుందని, తమ అభ్యంతరాలను అధికారులు పట్టించుకోవడం లేదని, అన్యాయంగా తరుగులు విధిస్తూ రైతులను వేధిస్తున్నారని మండిపడ్డారు. ఈ సందర్భంగా కేంద్రంలోని సహకార పరపతి సంఘం ఇన్చార్జి సీఈవో రాజశేఖర్ రెడ్డి "నిబంధనలు నచ్చకపోతే మీ ధాన్యాన్ని ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముకోండి" అని చెప్పడంతో రైతుల్లో మరింత ఆగ్రహం చెలరేగింది. దీంతో రైతులు ఒక్కసారిగా ఆందోళనకు దిగడంతో కొనుగోలు కేంద్రంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ వెంటనే ఘటనాస్థలికి చేరుకుని రైతులతో మాట్లాడారు. అనంతరం సంబంధిత ఉన్నతాధికారులతో ఫోన్ ద్వారా చర్చించి తూర్పార పట్టిన వడ్లను 5 కేజీలు తరుగు తీయడం అంటే రైతు నష్టపోతాడని, గతంలో లానే 3 కేజీల వరకు తరుగు తీయాలని సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతుల సమస్యలను పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో పరిస్థితి శాంతించింది.రైతులు న్యాయం జరిగేలా చూడాలని, భవిష్యత్తులో ఇలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. చిన్న చిన్న విషయాల వలన ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టిన వారవుతారని, రైతుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని అవకాశం ఉన్నంత వరకు వారికి అండగా నిలవాలని జూపల్లి రమేష్ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో జూపల్లి ప్రమోద్, విజయ్ కుమార్ రెడ్డి, పసుపులేటి రామస్వామి నాయుడు,ఫణి, రైతులు నాగరాజు, సత్యనారాయణ, శ్రీనివాస్, వ్యవసాయ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పది ఫలితాలలో ప్రభుత్వ విద్యార్థుల అత్యుత్తమ ఫలితాలు

**ఇల్లందు, ఏప్రిల్ 29, ప్రజాజ్యోతి:** పదవ తరగతి ఫలితాలలో ఇల్లందులోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించినట్లు ఎంఈఓ ఉమాశంకర్ తెలిపారు. బుధవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జేబీఎస్) లో 42 మంది విద్యార్థులకు గాను 36 మందికి 85.71 శాతం, ఎయిడెడ్ సింగరేణి కాలరీస్ హైస్కూల్ లో 82 మంది విద్యార్థులకు గాను 74 మంది 90.24, జడ్పీ గర్ల్స్ హై స్కూల్ లో 65 మంది విద్యార్థులకు గానూ 57 మందికి 87.69, మెయిన్ రోడ్డు హై స్కూల్ లో 42 మంది విద్యార్థులకు 36 మందికి 85.71, జెడ్పి హైస్కూల్ 21 ఫీట్ లో 8 మంది విద్యార్థులకు గాను ఐదుగురికి 62.50, జెడ్పీఎస్ఎస్ కొమరారంలో 29 మంది విద్యార్థులకు గాను 25 మందికి 86.21, జెడ్పిఎస్ఎస్ చల్ల సముద్రంలో 34 మంది విద్యార్థులకు గాను 32 మందితో 94.12, జెడ్పీఎస్ఎస్ సుభాష్ నగర్ లో 48 మంది విద్యార్థులకు గాను 37 మందికి 77.08 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా 350 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలకు హాజరుకాగా 302 మంది ఉత్తీర్ణులైనట్లు పేర్కొన్నారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, కృషి చేసిన అధ్యాపక బృందానికి శుభాకాంక్షలు తెలిపారు.

## అగ్రస్థాయి ఫలితాలతో త్రివేణి విద్యార్థుల ఆధిపత్యం

**లక్ష్మీదేవిపల్లి , ఏప్రిల్ 29 ( ప్రజాజ్యోతి )** 2026 సంవత్సరానికి సంబంధించిన ఎస్సెస్సీ పరీక్షల ఫలితాల్లో లక్ష్మీదేవిపల్లి మండల లోని త్రివేణి స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. రాష్ట్ర స్థాయిలో విడుదలైన ఫలితాల్లో త్రివేణి విద్యార్థులు విశేష విజయాలు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకువచ్చారు. పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి జగదీశ్ తెలిపిన వివరాల ప్రకారం ఈ ఏడాది కూడా విద్యార్థులు మెరుగైన ఫలితాలను సాధించారు. 600 మార్కులకు గాను 595 మార్కులు సాధించిన విద్యార్థి (హాల్ టికెట్ నంబర్: 2631118553) టాప్‌లో నిలిచారు. అదేవిధంగా 592, 591, 587, 586, 585, 584, 583, 582, 581, 580 మార్కులు సాధించిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. 580 పైగా మార్కులు సాధించిన వారు 32 మంది ఉండగా 570 పైగా మార్కులు సాధించిన వారు 81 మంది ఉన్నారు. త్రివేణి హైస్కూల్‌లో గాను విద్యార్థినులు అక్షయ, శివాని 592 మార్కులు సాధించగా పి. అక్షయ, కె. వర్షిత 586 మార్కులు, టీ. కుందనిక 585 మార్కులు సాధించారు. మొత్తంగా 580 పైగా పలువురు విద్యార్థులు, 570 పైగా 17 మంది, 550 పైగా 57 మంది, 500 పైగా 198 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఈ విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రుల సహకారం ప్రధాన కారణమని డైరెక్టర్ తెలిపారు. విజయం సాధించిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం అభినందించింది.



# ఇందిరమ్మ ఇళ్ల పనులపై కలెక్టర్ అంకిత్ ఆకస్మిక తనిఖీ





- నిర్మాణాల్లో నాణ్యతకు ప్రాధాన్యం
- వేగం పెంచాలని అధికారులకు సూచనలు

**అన్నపురెడ్డిపల్లి, ఏప్రిల్ 29, ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండలం పెంట్ల గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం ఆకస్మికంగా పరిశీలించారు. గ్రామంలో మంజూరైన 46 ఇళ్లలో 13 ఇళ్లు ఇప్పటికే పూర్తయ్యాయని, మిగిలినవి వివిధ దశల్లో కొనసాగుతున్నట్లు అధికారులు వివరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ తాటి లక్ష్మి అనే లబ్ధిదారురాలి ఇల్లు సందర్శించి, నిర్మాణ నాణ్యత మరియు పనుల పురోగతిని పరిశీలించారు. లబ్ధిదారురాలితో నేరుగా మాట్లాడి, ఇప్పటివరకు చేసిన ఖర్చు, ప్రభుత్వం విడుదల చేసిన నిధుల వినియోగం వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణాలు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉండేలా చూసి, గడువులోపు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ స్వర్ణ, ఎంపీడీవో మహాలక్ష్మి, మండల ఎంపీఓ షబానా, వ్యవసాయ అధికారి అనూష, ఇందిరమ్మ ఇల్లు కమిటీ సభ్యులు, పెంట్ల గ్రామ సర్పంచ్ శివ, అలాగే సంబంధిత గ్రామ ప్రతినిధులు పాల్గొన్నారు.

## పదో తరగతి ఫలితాలు వచ్చేశాయ్

- సుజాతనగర్ పి ఎం జెడ్ పీ హెచ్ ఎస్ పాఠశాలలో 77 శాతం ఉత్తీర్ణత
- పి భార్గవ్ 495 మార్కులు, ఎం నిహారిక 489 సాధించారు
- 400 మార్కులు పైన 35 మంది విద్యార్థులు సాధించారు
- రీ-వెరిఫికేషన్, రీ-కౌంటింగ్, రీ-వాల్యుయేషన్ వంటి అవకాశాలు అందుబాటులో ఉంటాయి.
- ఉత్తీర్ణత సాధించని వారికి సప్లిమెంటరీ పరీక్షల ద్వారా మరో అవకాశం లభిస్తుంది

**సుజాత నగర్ ప్రజాజ్యోతి ఏప్రిల్ 29:** విద్యార్థులు గత నెల రోజులుగా ఎంతో ఉత్కంఠగా ఎదురు చూస్తున్న పదో తరగతి ఫలితాలు బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావు చేతుల మీదగా ఫలితాలు వెల్లడించారు.సుజాతనగర్ మండలంలోని సుజాతనగర్ పి ఎం జెడ్ పీ హెచ్ ఎస్ పాఠశాల లో 2026 వ సంవత్సరం పదో తరగతి 82 మంది పరీక్షలు రాయగ, 63 మంది ఉత్తీర్ణులయ్యారు.పి భార్గవ్ 495 మార్కులు, ఎం నిహారిక 489 మార్కులు సాధించగా,400 మార్కులు పైన 35 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఫలితాల్లో విశిష్ట ఫలితాలను సాధించింది. ఈ విద్యాసంవత్సరానికి సంబంధించిన పదో తరగతి పరీక్షల్లో 77 శాతం ఉత్తీర్ణత నమోదైంది.పాఠశాల విద్యార్థులు 77 శాతం ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకువచ్చారు.మొత్తం విద్యార్థుల్లో 77 శాతం మంది ఉత్తీర్ణత సాధించినట్లు విద్యాశాఖ వెల్లడించింది. ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ అలాగే ఫలితాల్లో ఆశించిన మార్కులు రాకపోయినా విద్యార్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. రీ–వెరిఫికేషన్, రీ–కౌంటింగ్, రీ–వాల్యుయేషన్ వంటి అవకాశాలు అందుబాటులో ఉంటాయి. అలాగే పరీక్షలో ఉత్తీర్ణత సాధించని వారికి సప్లిమెంటరీ పరీక్షల ద్వారా మరో అవకాశం లభిస్తుంది అని ప్రధానోపాధ్యాయులు అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృం దం విద్యార్థుల కృషి, పట్టుదల ఫలితంగానే ఈ విజయాన్ని సాధించామని పే ర్కొన్నారు. విద్యార్థుల విద్యా ప్రగతికి అహర్నిశలు శ్రమించిన ఉపాధ్యాయుల ను, అలాగే తమ పిల్లల చదువులకు సహకరించిన తల్లిదండ్రులను ఈ సందర్భంగా అభినందించారు.ఈ విజయంతో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరింత మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తామని పాఠశాల యాజమాన్యం తెలిపింది.




## ఎస్ఎస్‌సీ ఫలితాల్లో క్రాంతి విద్యాలయం విజయభేరి

- విద్యార్థుల అద్భుత ప్రతిభ
- డివిజన్ స్థాయిలో రికార్డు సృష్టించిన హనీ





**భద్రాచలం టౌన్, ఏప్రిల్ 29, ప్రజాజ్యోతి:** పదో తరగతి ఫలితాలు బుధవారం విడుదల కాగా, భద్రాచలం పట్టణంలోని క్రాంతి విద్యాలయం విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి విజయభేరి మోగించారు. పాఠశాలకు చెందిన తాళ్లూరి చరిత 600 మార్కులకు గాను 576 మార్కులు సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. అలాగే చిన్మయి సాయి 563 మార్కులు, సాహితి 554 మార్కులు, చరణ్య షాలిని 554 మార్కులు సాధించారు. మొత్తంగా 11 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకువచ్చారు.పాఠశాలకు చెందిన విద్యార్థిని హనీ సామాజిక శాస్త్రం విభాగంలో నూటికి నూరు మార్కులు సాధించి డివిజన్ వ్యాప్తంగా రికార్డు సృష్టించడం విశేషంగా నిలిచింది.విద్యార్థులు సాధించిన విజయంపై పాఠశాల చైర్మన్ పానుగంటి సమత హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థులు సాధించిన ఫలితాలే పాఠశాల విద్యా నైపుణ్యాలకు నిదర్శనమని అన్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లడంతో పాటు, సగటు విద్యార్థులను కూడా ఉత్తమ స్థాయికి తీసుకురావడంలో ఉపాధ్యాయుల కృషి అభినందనీయమని పేర్కొన్నారు.చదువుతో పాటు జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దటం క్రాంతి విద్యాలయం ప్రత్యేకత అని ఆమె తెలిపారు.పాఠశాల డైరెక్టర్ సోమరౌతు శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, వారికి మార్గనిర్దేశం చేసిన ఉపాధ్యాయులను అభినందించారు. డివిజన్ స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన తాళ్లూరి చరితను పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది.ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేయగా, విద్యార్థులు టపాసులు కాల్చి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

## అక్రమ ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

**బూర్గంపహాడ్, ఏప్రిల్ 29 (ప్రజా జ్యోతి):** ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను బూర్గంపహాడ్ పోలీసులు బుధవారం పట్టుకున్నారు. కిన్నెరసాని వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఉప్పుసాకకు చెందిన రెండు ట్రాక్టర్లు, బూర్గంపహాడ్ కు చెందిన ఒక ట్రాక్టర్ ను ఎస్సై మేడా ప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్సై దేవ్ సింగ్, పోలీసు బృందం ఆయా ప్రాంతాల్లో దాడిచేసి పట్టుకున్నారు. పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లను తహశీల్దార్ కు అప్పగించారు.

## మేడే స్ఫూర్తితో పోరాటాలు ఉధృతం: సీఐటీయూ



**కొత్తగూడెం, ఏప్రిల్ 29 ( ప్రజాజ్యోతి )** మేడే అమరవీరుల స్ఫూర్తితో లేబర్ కోడ్లు రద్దయ్యే వరకు కార్మిక పోరాటాలు కొనసాగుతాయని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి భూక్య రమేష్ అన్నారు. మేడే సందర్భంగా మే 1 నుంచి 7 వరకు వారోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కొత్తగూడెం మంచికంటి భవన్ లో జరిగిన సీఐటీయూ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మిక ప్రాంతాల్లో ఎర్రజెండాలు ఎగురవేసి, కార్మిక హక్కులపై అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ఎనిమిది గంటల పని దినం కోసం జరిగిన పోరాటాల చరిత్రను కార్మికులు తెలుసుకోవాలని సూచించారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ నాలుగు లేబర్ కోడ్ల రద్దు వరకు ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

## మహిళలు, బాలల భద్రతపై అవగాహన సదస్సులు






**కొత్తగూడెం, ఏప్రిల్ 29 ( ప్రజాజ్యోతి )** మహిళలు, బాలల భద్రతపై అవగాహన పెంపొందించేందుకు జిల్లా భరోసా సెంటర్ ఆధ్వర్యంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అవగాహన సదస్సులు నిర్వహించారు. కొత్తగూడెం ఉద్యోగ సంస్థ ఆధ్వర్యంలో ఎమ్మార్వో కార్యాలయం సమీపంలో గల తెలంగాణ ఏకలవ్య పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమాలకు అధిక సంఖ్యలో ఉద్యోగులు హాజరయ్యారు. ఈ సందర్భంగా భరోసా సెంటర్ బృందం పోష్ చట్టం, లింగ సమానత్వం, బాలల భద్రత, మహిళలపై హింస, జెండర్ బైస్, సైబర్ నేరాల పెరుగుదల వంటి అంశాలపై అవగాహన కల్పించింది. బాల్య వివాహాల దుష్ప్రభావాలను వివరించారు. యువత సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని అనుమానాస్పద ఘటనలు గమనిస్తే వెంటనే స్పందించాలని సూచించారు. అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్లు 100, 112, 1930, 1098 గురించి వివరించారు. సమస్యలు ఎదురైనప్పుడు భయపడకుండా ఫిర్యాదు చేయాలని తెలిపారు. భరోసా సెంటర్ అందించే సేవలు, బాధితులకు న్యాయ సహాయం, మానసిక వైద్య సేవలపై కూడా వివరించారు. కార్యక్రమంలో భరోసా సెంటర్ బృందానికి చెందిన అంబికా, రమాదేవి, సంధ్యారాణి పాల్గొన్నారు. పోలీస్ శాఖ సిబ్బంది కూడా హాజరయ్యారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**ఇల్లందు, ఏప్రిల్ 29, ప్రజాజ్యోతి:** సింగరేణి పాఠశాలలో 1985–1995లో చదివిన పూర్వ విద్యార్థులు బుధవారం అపూర్వ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. దాదాపు మూడు దశాబ్దాల తర్వాత కలుసుకున్న స్నేహితులు తమ పాత జ్ఞాపకాలను తలుచుకుంటూ ఆనందోత్సాహాలతో గడిపారు. సుమారుగా 70 మందికి పైగా పూర్వ విద్యార్థులు మహారాష్ట్ర, హైదరాబాద్, గోదావరిఖని తదితర దూర ప్రాంతాల నుండి హాజరయ్యారు. చాలా కాలం తరువాత కలుసుకున్న సహాధ్యాయులు పరస్పరం అభివాదాలు చేసుకుంటూ, పాఠశాల రోజుల్లోని మధుర స్మృతులను పంచుకున్నారు. నాగిరెడ్డి, శంకర్ రావు, సుధాకర్, చంద్రశేఖర్, ప్రభాకర్, నిర్మల, మేరీ, అరుణ, స్టెల్లా, లలిత ఉపాధ్యాయులు ప్రత్యేకంగా పాల్గొని విద్యార్థులకు ఆశీస్సులు అందించారు. పూర్వ విద్యార్థులు తమ జీవితాల్లో సాధించిన విజయాలను పంచుకోవడంతో పాటు, తమ ఎదుగుదలకు బాటలు వేసిన గురువులకు కృతజ్ఞతలు తెలిపారు. గురువులు కూడా విద్యార్థుల పురోగతిపై సంతోషం వ్యక్తం చేస్తూ, మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల సహకారం అవసరమని, భవిష్యత్తులో మరిన్ని సామాజిక కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. పాఠశాల ఆవరణలో స్నేహభావ వాతావరణం నెలకొంది.

## 10లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ఉత్తమ ప్రతిభ



**టేకులపల్లి,ఏప్రిల్29, ప్రజాజ్యోతి**:టేకులపల్లి మండలం ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులు పదవ తరగతి ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచారు.ఈ సందర్భంగా ఎంఈఓ జగన్ మాట్లాడుతూ టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి శాగంటి హర్షత 538, తేజస్విని 531, జడ్పీహెచ్ఎస్ బేతంపూడి సంజన 443,బానోత్ కావేరి 437,జడ్పీహెచ్ఎస్ బోడు 477,రవి చరణ్ 472,జడ్పీహెచ్ఎస్ కుంటాల జసిక 427,హిందూ 417,జడ్పీహెచ్ఎస్ బొమ్మనపల్లి అఖిల్ కుమార్ 500,కావేరి 453, జడ్పీహెచ్ఎస్ ముత్యాలంపాడు నాగలక్ష్మి 486,సుజిత 466, కేజీబివి టేకులపల్లి అంజలి 455,సనశ్రీ 452,జడ్పీహెచ్ఎస్ సులానగర్ హర్షిత 501,పేనిలా 494, ఏ హెచ్ ఎస్ కోయగూడెం బి విష్ణు 445, అరవింద్ 398, ఏ హెచ్ ఎస్ గంగారం పి.పూజిత్ 450,జి. రాహుల్ 449 లు ప్రభుత్వ పాఠశాలలో చదివి 600 మార్కులకు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో ఉత్తీర్ణత సాధించి ప్రభుత్వ పాఠశాలలో చదివే ఎంతో ప్రాముఖ్యత అని వారు తెలిపారు.

## 554 మార్కులతో సంధ్య విజయం – అన్నపురెడ్డిపల్లి మండల టాపర్

**అన్నపురెడ్డిపల్లి, ఏప్రిల్ 29, ప్రజా జ్యోతి:** పదో తరగతి ఫలితాల్లో అన్నపురెడ్డిపల్లి మండలంలోని పాఠశాలలు మంచి ప్రతిభ కనబరిచాయి. అమ్మాయిల సోషల్ వెల్ఫేర్ పాఠశాలకు చెందిన విద్యార్థిని సంధ్య 554 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. ఆమె ప్రతిభకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు అభినందనలు తెలిపారు. రాజాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించారు. సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో 67 మందికి 66 మంది, సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో 72 మందికి 71 మంది ఉత్తీర్ణులయ్యారు. కేజీబీవీలో 41 మందికి 39 మంది ఉత్తీర్ణత సాధించగా, అన్నపురెడ్డిపల్లి జడ్పీ పాఠశాలలో 61 మందికి 58 మంది ఉత్తీర్ణులయ్యారు. ఎర్రగుంట జడ్పీ హైస్కూల్‌లో 37 మందికి 31 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల శ్రద్ధతో ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని పాఠశాల యాజమాన్యం తెలిపింది. భవిష్యత్తులో మరింత మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి కొనసాగిస్తామని పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా మంచి రిజల్ట్ వచ్చినందుకు ఎంఈఓ ఉండేటి ఆనంద్ కుమార్ విద్యార్థులు అందరికీ అభినందనలు తెలిపారు అలాగే ఈ విజయానికి విద్యార్థులను ప్రోత్సహించిన ఉపాధ్యాయులందరకు అభినందనలు తెలిపారు.



# సంస్థాగత సందడి

- పార్టీ పటిష్టతపై కాంగ్రెస్, బీఆర్ఎస్ దృష్టి
- అనుభవజ్ఞులకు ప్రాధాన్యత కోరుతున్న కాంగ్రెస్ శ్రేణులు
- అందరినీ కలుపుకొని ముందుకెళ్తున్న బీఆర్ఎస్





**భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి సంస్థాగత బలోపేతంపై దృష్టి సారిస్తున్నాయి. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయాలని రెండు పార్టీలూ వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్నాయి. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు, పరిషత్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని క్షేత్రస్థాయిలో పార్టీని చురుకుగా మార్చేందుకు నాయకత్వాలు చర్యలు చేపడుతున్నాయి.**

**● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి**

### ››› కాంగ్రెస్ లో కమిటీల నియామకాలపై ఆసక్తి////

కాంగ్రెస్ పార్టీలో మండల, పట్టణ, బ్లాక్ కమిటీల నియామక ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ఇప్పటికే ఆయా కమిటీలకు సంబంధించిన పేర్ల జాబితాలను రాష్ట్ర నాయకత్వానికి పంపించినట్లు సమాచారం. ఒకటి రెండు రోజుల్లో అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

ఈ నేపథ్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలుగా కష్టపడి పనిచేస్తూ, పార్టీని నమ్ముకొని ముందుకు సాగిన సీనియర్ నాయకులకు ప్రాధాన్యత ఇవ్వాలని పార్టీ శ్రేణులు కోరుతున్నాయి. అధికారంలో లేకున్నా పార్టీ కోసం కష్టకాలంలో పనిచేసిన కార్యకర్తలను గుర్తించి బాధ్యతలు అప్పగిస్తేనే క్షేత్ర స్థాయిలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని సీనియర్లు అభిప్రాయపడుతున్నారు.కొంతమంది నాయకులు మాత్రం కొత్త వారికి కూడా అవకాశాలు కల్పిస్తూ అనుభవం, యువ శక్తి కలయికతో కమిటీలను రూపొందిస్తే పార్టీకి మేలు జరుగుతుందని సూచిస్తున్నారు. మహిళలు, యువత, సామాజిక వర్గాలకు సముచిత ప్రాధాన్యం కల్పించాలని కూడా డిమాండ్లు వినిపిస్తున్నాయి.

### ››› బీఆర్ఎస్ లో పునర్నిర్మాణానికి శ్రీకారం///

ఇక భారత రాష్ట్ర సమితి పార్టీలో రాష్ట్ర కమిటీ మినహా మిగతా అన్ని కమిటీలను రద్దు చేసిన తర్వాత పార్టీ పునర్నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. జిల్లా, మండల, పట్టణ స్థాయిలో కొత్త కమిటీల ఏర్పాటు, సభ్యత్వ నమోదు కార్యక్రమాలపై పార్టీ నాయకత్వం కార్యాచరణ రూపొందిస్తోంది.

పార్టీ అధినేత కేసీఆర్ సూచనల మేరకు క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని, ముఖ్యంగా యువతను పార్టీలో చురుకుగా భాగస్వామ్యం చేయాలని నాయకత్వం భావిస్తోంది. దీనిలో భాగంగా జిల్లాలో ఇప్పటికే పలుచోట్ల పార్టీ సమావేశాలు నిర్వహిస్తూ నాయకులు, కార్యకర్తలను ఒకే వేదికపైకి తీసుకురావడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.భారత రాష్ట్ర సమితిలో అన్ని వర్గాల నాయకులను, కార్యకర్తలను కలుపుకొని ముందుకు సాగుతూ పార్టీ సత్తా చాటాలని జిల్లా నాయకత్వం కసరత్తు చేస్తోంది. ఇటీవల నిర్వహిస్తున్న సమావేశాల్లో పార్టీ బలోపేతం, సభ్యత్వ నమోదు, గ్రామ స్థాయి కార్యకలాపాలపై చర్చలు జరుగుతున్నాయి.

### ››› ఎన్నికల దృష్ట్యా వ్యూహాలు////

రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రెండు పార్టీలూ క్షేత్ర స్థాయిలో బలమైన నాయకత్వాన్ని తయారు చేయడంపై దృష్టి సారిస్తున్నాయి. యువత, మహిళలు, సామాజిక వర్గాలను ఆకర్షించే విధంగా కార్యక్రమాలు చేపడుతూ గ్రామ స్థాయిలో పార్టీ పునాదులను బలోపేతం చేయాలని నాయకత్వాలు భావిస్తున్నాయి. దీంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రాజకీయ వాతావరణం క్రమంగా వేడెక్కుతోంది.

**కష్టపడి పనిచేసిన వారికి సముచిత గుర్తింపు : దేవీప్రసన్న,డీసీసీ అధ్యక్షురాలు**

పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి సముచిత గుర్తింపు ఇవ్వడం జరుగుతుంది. మండల, పట్టణ, బ్లాక్ కమిటీల ద్వారా పార్టీని గ్రామ స్థాయిలో మరింత బలోపేతం చేస్తాం

**త్వరలో సభ్యత్వ నమోదు: రేగా కాంతారావు , బి ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షుడు**

పార్టీ పునర్నిర్మాణంలో భాగంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని త్వరలో ప్రారంభిస్తాం. గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు చేపడుతున్నాం. అందరినీ కలుపుకొని ముందుకు సాగడమే మా లక్ష్యం.



# 'రాహుల్ విజ్ఞాన్' విద్యార్థుల అద్భుత ప్రతిభ

- పదవ తరగతి ఫలితాలలో 16 మందికి 500 పైగా మార్కులు
- విద్యాబోధనలో మళ్ళీ నిరూపించుకున్న 'విజ్ఞాన్'
- సబ్జెక్టుల వారీగానూ సత్తా చాటిన రాహుల్ విజ్ఞాన్ విద్యార్థులు




**చర్ల, ఏప్రిల్ 29: (ప్రజా జ్యోతి ):** తెలంగాణ రాష్ట్రంలో బుధవారం విడుదలైన పదవ తరగతి ఫలితాలలో చర్లలోని రాహుల్ విజ్ఞాన్ విద్యాలయం విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి ఘన విజయాన్ని సాధించారు.ఈ ఫలితాలలో పి. నిశాంత్ రెడ్డి 573 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచి, చర్ల మండల స్థాయిలో ద్వితీయ స్థానాన్ని దక్కించుకున్నాడు. ఎం. మెహరాజ్ 566 మార్కులతో ద్వితీయ స్థానం, పి. సాయి తేజ 558 మార్కులతో తృతీయ స్థానం సాధించారు.మొత్తం 63 మంది విద్యార్థుల్లో 62 మంది ఉత్తీర్ణత సాధించడం ద్వారా పాఠశాల 98%కు పైగా ఫలితాలను నమోదు చేసింది.

**మార్కుల వారీగా వివరాలు ఇలా ఉన్నాయి:**

500 పైగా మార్కులు సాధించిన వారు – 16 మంది,450 నుండి 499 మధ్య – 18 మంది,400 నుండి 449 మధ్య – 23 మంది,350 నుండి 399 మధ్య – 5 మంది ఉత్తమ ప్రతిభ కనపరిచారు.

**90–99 మార్కులు సాధించిన విద్యార్థుల సంఖ్య:**

సోషల్ – 23 మంది,జనరల్ సైన్స్ – 22 మంది,ఇంగ్లీష్ – 20 మంది, గణితం – 12 మంది,తెలుగు – 6 మంది,హిందీ – 3 మంది ఉత్తమ ఫలితాలు సాధించారు.ఈ సందర్భంగా పాఠశాల వ్యవస్థాపకులు డాక్టర్ డి.ఎన్. కుమార్, డాక్టర్ డి. ప్రతిభ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శాస్త్రి, ప్రిన్సిపాల్ వర్మ రాజు , ఉపాధ్యాయ బృందం, విద్యార్థులను అభినందించారు.

## మెరుగైన వేతన ఒప్పందం కోసం కార్మికుల నిరసన ర్యాలీ



**బూర్గంపహాడ్,ఏప్రిల్ 29(ప్రజా జ్యోతి ):** సారపాక ఐటిసి కర్మాగారంలో 14వ వేతన ఒప్పందం మెరుగైన వేతన ఒప్పందం చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఐఎన్టీయూసీ మిత్రపక్షాల ఆధ్వర్యంలో కార్మికులు ఐటిసి ఏటీఎం చౌరస్తా సెంటర్ నుండి అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ వరకు భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. 14వ వేతన ఒప్పందం రూ.22000 ప్యాకేజీ, పూర్తి మెడికల్ అనే ప్రధాన డిమాండ్లతో కార్మికులు నినాదాలు చేస్తూ ప్రదర్శన నిర్వహించారు.ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి యారం పిచ్చి రెడ్డి,అధ్యక్షులు గొనె రామారావు మాట్లాడుతూ కష్టపడి పనిచేసే కార్మికుడికి న్యాయం జరగాలని, మెరుగైన వేతనం పొందడం కార్మికుల ప్రాథమిక హక్కు అని ఉద్ఘాటించారు. కార్మిక ఐక్యతే మన బలమని, వేతన ఒప్పందం డిమాండ్లు అయ్యే వరకు పోరాటం ఆగదని వారు స్పష్టం చేశారు. ఏప్రిల్ నెల పూర్తవుతుందని కొత్త జీతంతో వేతనం చెల్లించాల్సి ఉండగా ఇప్పటివరకు ఎటువంటి సమాచారం చెప్పకుండా యాజమాన్యం మరియు రిగనైజ్డ్ యూనియన్ కార్మికుల్ని అయోమయానికి గురి చేస్తున్నారన్నారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని యాజమాన్య అధికారులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ మిత్రపక్షాల నాయకులు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్ల పనులను అడ్డుకోవడం తగదు

- బీఆర్ఎస్ ఎస్టీ సెల్ నేత కారం కన్నారావు



**చర్ల, ఏప్రిల్ 29(ప్రజా జ్యోతి ):** ఏజెన్సీ ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధిని అడ్డుకోవడం సరైన విధానం కాదని దీనివల్ల స్థానిక ప్రజలు అభివృద్ధికి దూరమవుతున్నారని బీఆర్ఎస్ ఎస్టీ సెల్ నాయకుడు కారం కన్నారావు అన్నారు.చర్ల మండలం తిప్పాపురం గ్రామానికి చెందిన మారుమూల ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రభుత్వం నిధులు కేటాయించినప్పటికీ అనివార్య కారణాలతో కొన్ని రోడ్డు పనులు నిలిచిపోయాయని తెలిపారు. అయితే తిప్పాపురానికి చెందిన కొంత మంది కాంట్రాక్టర్లు సర్పంచ్ అండదండలతో రోడ్డు కాంట్రాక్టర్‌ను బెదిరిస్తూ పనులు జరగకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు.ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న రోడ్డు సౌకర్యాన్ని కూడా అడ్డుకుంటూ తిప్పాపురం నుంచి బత్తిపల్లి వెళ్లే రహదారి మార్గంలో వ్యతిరేక చర్యలు చేపడుతున్నారని ఆయన విమర్శించారు. ఈ విధంగా వ్యవహరించడం ద్వారా ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసీలకు అన్యాయం జరుగుతోందని తెలిపారు.ఈ విషయంపై సంబంధిత అధికారులు ముఖ్యంగా ఆర్&బి శాఖ అధికారులు చొరవ తీసుకుని రోడ్డు పనులను అడ్డుకుంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే నిలిచిపోయిన పనులను తక్షణమే పూర్తి చేయాలని ఆయన అన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి



**భద్రాచలం, ఏప్రిల్ 29 , ప్రజా జ్యోతి:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక "99 డేస్" కార్యక్రమంలో భాగంగా మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "చైల్డ్ సేఫ్టీ అండ్ ప్రొటెక్షన్ వీక్" కార్యక్రమాల్లో భాగంగా మూడో రోజు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.భద్రాచలంలోని గ్రంథాలయం స్టడీ సెంటర్, మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్స్ ట్రైబల్ ట్రైనింగ్ స్కూల్‌లలో ఈ అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా నేటి సమాజంలో పెరుగుతున్న సైబర్ మోసాలపై విద్యార్థులు, యువత అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.ఫోన్ కాల్స్, ఎస్ఎంఎస్‌లు, ఉచిత ఆఫర్ల పేరుతో వచ్చే సందేశాలు, తెలియని లింక్‌లను క్లిక్ చేయడం, ఆన్‌లైన్ గేమ్స్, సోషల్ మీడియా పరిచయాల ద్వారా మోసపోయే అవకాశాలు అధికంగా ఉన్నాయని వివరించారు. సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు.ఈ సందర్భంగా సైబర్ క్రైమ్ భద్రతకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అలాగే అత్యవసర సేవల కోసం వినియోగించే టోల్ ఫ్రీ నంబర్లు 1930, 1098, 100, 181 గురించి అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు మహమ్మద్ సాధిక్ పాషా, సీడీపీఓ జ్యోతి, భద్రాచలం పట్టణ సబ్ఇన్‌స్పెక్టర్ సతీష్, రామకృష్ణ, తిరుపతి, సర్పంచ్ పూనెం కృష్ణ, వార్డు సభ్యులు, గ్రంథాలయ చైర్మన్, జిల్లా చైల్డ్ రక్షణ విభాగం సిబ్బంది లత, జిల్లా ఉమెన్ హబ్ బృందం సభ్యులు సంతోషి, రూప, స్వాతి, సౌజన్య, సఖి బృందం, కిశోర బాలికలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, నర్సింగ్ కళాశాల విద్యార్థులు, పాల్గొన్నారు.

## మాస్టర్ మైండ్ విద్యార్థుల ప్రతిభ



**ఇల్లందు, ఏప్రిల్ 29, ప్రజాజ్యోతి:** పదవ తరగతి ఫలితాలలో పట్టణంలోని మాస్టర్ మైండ్ పాఠశాల విద్యార్థులు వారి ప్రతిభను చాటుకున్నారు. ఎండి అబ్దుల్ రెహమాన్ 569/600, పి భాస్కర్ రావు 559/600, టి ఆశశ్రీ 549/600, యం మానాన్య శ్రీ 527/600, పి సాత్విక్ 525/600 మార్కులు సాధించినట్లు బుధవారం పాఠశాల యాజమాన్యం తెలిపారు. అత్యుత్తమ ఫలితాలు సాధించినందుకు విద్యార్థులు, సహకరించిన తల్లిదండ్రులు, కృషి చేసిన అధ్యాపకులకు మాస్టర్ మైండ్ స్కూల్ డైరెక్టర్లు జక్కుల సర్వేశ్వరరావు, పెరుగు రామకృష్ణ లు అభినందనలు తెలిపారు.

## పది ఫలితాల్లో గురుదేవ్ విద్యాలయం 'క్లీన్ స్వీప్'

- చర్ల మండలంలో మొదటి మూడు స్థానాలు గురుదేవ్ విద్యార్థులవే



**చర్ల, ఏప్రిల్ 29: (ప్రజా జ్యోతి ):** తెలంగాణలో బుధవారం విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో గురుదేవ్ విద్యాలయం విద్యార్థులు తమ ప్రతిభను చాటుతూ మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. షేక్ తహీర 577 మార్కులతో ప్రథమ స్థానంలో నిలవగా, ఇల్లెందుల హర్షిణి 573 మార్కులతో ద్వితీయ స్థానం, జీడిగుంట రాహిత్య 572 మార్కులతో తృతీయ స్థానం సాధించారు. మొత్తం 48 మంది విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించడం ద్వారా ఈ పాఠశాల మండల స్థాయిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించిన ఏకైక ప్రైవేట్ పాఠశాలగా నిలిచింది.

**మార్కుల వారీగా :** 550కు పైగా మార్కులు సాధించిన వారు 9 మంది, 500 నుండి 550 మధ్య 9 మంది, 450 నుండి 500 మధ్య 15 మంది, 400 నుండి 450 మధ్య 11 మంది, 340 నుండి 400 మధ్య 4 మంది విద్యార్థులు ఉన్నారు. విద్యార్థులు సాధించిన ఈ విజయానికి తల్లిదండ్రులు ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు ఎం.వి. సుబ్రహ్మణ్యం, అకడమిక్ కోఆర్డినేటర్లు జి. శ్రీనివాస్ తదితరులు మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేసి వారి తల్లిదండ్రులు ఉపాధ్యాయ బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఇందిరమ్మ ఇండ్లు అర్హులకే కేటాయించాలి

- మాల జన సమితి నియోజకవర్గ అధ్యక్షులు చెట్టి సురేష్

**అశ్వాపురం, ఏప్రిల్ 29 ప్రజా జ్యోతి** భద్రాద్రి కొత్తగూడెం అశ్వాపురం మండల కేంద్రంలో మాల జన సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పినపాక నియోజకవర్గ అధ్యక్షులు చెట్టి సురేష్ మాట్లాడుతూ అశ్వాపురం మండలంలో ఇందిరమ్మ ఇండ్లు రెండవ విడత లో లబ్ధిదారుల ఎంపిక విషయంలో అధికారులు పారదర్శకత పాటించి నిరుపేదలను అర్హులను జాబితాలో చేర్చాలని గ్రామ సభ ద్వారా అర్హులను గుర్తించి విచారణ జరిపిన తర్వాతే తుది జాబితా ప్రకటించాలని ప్రభుత్వ నిబంధనలు చెబుతున్నాయని ఈ సందర్భంగా గుర్తు చేశారు... కానీ కొందరు వ్యక్తులు మా పేర్లు లిస్ట్ లో వచ్చేసాయని లిస్టు ఫైనల్ అయిపోయింది అని ముందుగానే ప్రచారం చేస్తున్నారు.. కావున రెండవ విడత ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో అనర్హుల పేర్లు ముందుగానే చేర్చారనే ఆరోపణల వస్తున్నాయి దీనిపై విచారణ జరపాలని అధికారులను కోరారు.. అనర్హుల పేర్లు జాబితాలో చేర్చడం వలన నిజమైన నిరుపేదలకు అన్యాయం జరిగే అవకాశం ఉందని ఉందని దీని ద్వారా ప్రభుత్వ నిధులు దుర్వినియోగం జరిగే ప్రమాదం ఉందని ఈ సందర్భంగా తెలియ



జేశారు... ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక విషయంలో అనర్హుల పేర్లు చేర్చి అవకతవకలు జరిగిన పక్షంలో జిల్లా హౌసింగ్ ఆఫీసర్ –జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు...ఈ కార్యక్రమంలో మాలజనసమితి అశ్వాపురం మండల అధ్యక్షులు చెట్టి మనోజ్, జూపల్లి ధ్రువ కుమార్, బత్తుల కిరణ్ తదితరులు పాల్గొన్నారు

## పదిఫలితాలలో జవహర్ విద్యార్థుల హవా

- " 100% ఉత్తీర్ణత సాధించిన జవహర్ విద్యాలయం





**అశ్వారావుపేట, ఏప్రిల్ 29, ప్రజాజ్యోతి:** పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మండలంలోని విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచారు. మండల వ్యాప్తంగా మంచి ఉత్తీర్ణత సాధించారు. నియోజకవర్గ కేంద్రంలోని జవహర్ విద్యాలయంలో 46 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవ్వగా 46 మంది ఉత్తీర్ణత సాధించారు.ఇదే పాఠశాలకు చెందిన ఎమ్. కాత్యాయని 600మార్కులకు గాను 574మార్కులతో మండలంలోనే ఫస్ట్ ర్యాంక్ సాధించింది . ఇదే విద్యాలయానికి చెందిన టి. హాసిని అనే విద్యార్థి 569 మార్కులతో మండలంలో రెండవ ర్యాంకు సాధించింది. 34 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించినట్లు కరస్పాండెంట్ ఇనుగంటి మైథిలి, ప్రిన్సిపల్ ప్రవీణ్ తెలిపారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను పలువురు మండల ప్రముఖులు ఉపాధ్యాయులు అభినందించారు.

## ఎమ్మెల్యే పాయం సమక్షంలో సర్పంచ్ చేరిక





**గుండాల మార్చి 29 ప్రజా జ్యోతి** పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు సమక్షంలో గుండాల మండలం రోళ్లగడ్డ గ్రామపంచాయతీ సర్పంచ్ మంగమ్మ బి ఆర్ ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ లో చేరారు శనివారం మండల పర్యటనకు వచ్చినాయన రోలగడ్డలో పార్టీ కార్యకర్తలతో మాట్లాడిన అనంతరం సర్పంచ్ మంగమ్మ తో పాటు వార్డు సభ్యులు పలు కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరాయి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు వారికి కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అభివృద్ధిని చూసి సంక్షేమాన్ని గమనించి కాంగ్రెస్ లోకి చేరేందుకు మక్కువ చూపుతున్నారన్నారు. సర్పంచ్ మంగమ్మ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ పార్టీ వలన జరుగుతుందని అభివృద్ధి కోసమే బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ లోకి చేరుతున్నట్టు ఆమె తెలిపారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ముత్తయ్య, జిల్లా కార్యదర్శి ఎస్కే ఖదీర్, నాయకులు వాంకుడోత్ బికోజి ఊరికే బుచ్చయ్య, ధారా అశోక్, సర్పంచులు సంజీవరావు వసంతరావు కృష్ణారావు, అబ్దుల్ నవి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# పది ఫలితాలలో ఎక్స్ లెంట్ స్కూల్ ప్రభంజనం

- - మణుగూరు డివిజన్ స్థాయిలో చరిత్ర సృష్టించిన బాంబేకాలనీ ఎక్స్ లెంట్ విద్యార్థులు




**మణుగూరు, ఏప్రిల్ 29 (ప్రజాజ్యోతి) :** రాష్ట్రవ్యాప్తంగా బుధవారం విడుదలైన పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో మండలంలోని బాంబేకాలనీ ఎక్స్ లెంట్ స్కూల్ విద్యార్థులు మండల మొదటి రెండు ర్యాంకులు సొంతం చేసుకొని మణుగూరు డివిజన్ స్థాయిలో చరిత్ర సృష్టించారు. పాఠశాల కరస్పాండెంట్ జెఎం. ఖాన్ తెలిపిన వివరాల ప్రకారం కేతబోయిన యశ్విత 586/600 (హాల్ టికెట్ నంబర్: 2609107922) మార్కులతో డివిజన్ స్థాయిలో మొదటి ర్యాంక్ కైవసం చేసుకోగా, డివివి స్ఎన్.రాజు 578/600 (హాల్ టికెట్ నంబర్: 2609107802) మార్కులతో రెండవ ర్యాంక్ సాధించి డివిజన్ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనపరిచారు. ఈ నేపథ్యంలో 42 మంది విద్యార్థులు హాజరుకాగా 40 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. అదేవిధంగా బి.జీవన్ 570, ఆర్.సాయి హర్షిణి 558, బి.తానీష్ కుమార్ 556, ఎస్.కే. అబ్దుల్ జునైద్ 554, జి. రాధాకృష్ణ 545, పి. నాగప్రణీత్ 535, సిహెచ్. యశశ్విని 522, టీ. సన్ని 521, ఎండి. ఆఫియా 514, పి. మేఘన 513, ఎండి.సమీన్ 512, బి.ఉదయసాయి 511, సిహెచ్. రాజేశ్వరి 509, ఎం. ప్రేమ్ చంద్ 16 మంది విద్యార్థులు 500 మార్కులకు పైగా సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా పదవ తరతి పరీక్షల్లో ఉత్తీర్ణులైన ప్రతి విద్యార్థికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు విశేష ప్రతిభ కనపరచి పాఠశాలకు మంచి పేరు తీసుకువచ్చారు. ఈ ఏడాది కూడా విద్యార్థులు మెరుగైన ఫలితాలను సాధించారని జెఎం.ఖాన్ విద్యార్థులను అభినందించారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ ఎంజె. భాను ఖాన్ మాట్లాడుతూ... మార్కులు అనేవి విద్యార్థుల జీవితాన్ని నిర్ణయించే ఒక భాగం మాత్రమే. కొంతమంది విద్యార్థులకు తక్కువ మార్కులు వచ్చినా మనోధైర్యాన్ని కోల్పోకుండా ముందుకు సాగాలని అన్నారు. ఉన్నత విద్యను కొనసాగిస్తూ తమ లక్ష్యాలను సాధించాలని సూచించారు. విద్యార్థుల విజయంలో తల్లిదండ్రులు మరియు గురువుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. విద్యార్థులు మంచి దారిలో ముందుకు సాగేందుకు కుటుంబ సభ్యులు, గురువులు అండగా నిలవాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. వారి ప్రోత్సాహం, మార్గదర్శకత్వం ఉంటే విద్యార్థులు మరింత ఉన్నత స్థాయికి చేరుకుంటారని అన్నారు. ఈ విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రుల సహకారం ప్రధాన కారణమని తెలిపారు. రికార్డ్ స్థాయిలో విజయం సాధించిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ అభినందించారు.

# సైబర్ నేరాల వలలో చిక్కోద్దు

- నేరస్తులపై అప్రమత్తంగా ఉండండి
- డి.ఎస్.పి వెంకన్న బాబు





**గుండాల మార్చి 29. ప్రజా జ్యోతి** సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఇల్లందు డిఎస్పి వెంకన్న బాబు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సైబర్ క్రైమ్ ఫై అవగాహన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు మహిళలు మేధావులు విద్యార్థులు యువకులు సైబర్ నేరాల పట్ల అవగాహన చేసుకొని అప్రమత్తంగా ఉండాలని కోరారు సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని, వాటిని అరికట్టడం కోసం ప్రజలు చైతన్యవంతులు కావాలన్నారు. మోసగాళ్ల వాళ్లలో పడకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు ఎప్పటికప్పుడు సమాజంలో జరుగుతున్న మార్పులకు అనుకూలంగా అన్ని అవగాహన చేసుకుని మోసానికి గురికాకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. సమాజంలో కష్టపడకుండా డబ్బు సంపాదించాలన్న ఆలోచనతో కొంతమంది నేరాలకు, మోసాలకు పాల్పడుతున్నారని దీన్ని గమనించి వారిని తిప్పి కొట్టాలన్నారు ఈ కార్యక్రమంలో డి సి పి ఓ హరి కుమారి, సిడిపిఓ మంగతాయా రూ, గుండాల సీఐ శ్రీపతి తిరుపతి, పుష్ప, అన్నపూర్ణ సందీప్, లలిత తదితరులు పాల్గొన్నారు

## బాలికలకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం

**చర్ల, ఏప్రిల్ 29: (ప్రజా జ్యోతి ):** చర్ల మండల కేంద్రంలో '99 రోజుల ప్రగతి ప్రణాళిక'లో భాగంగా విద్యార్థులకు, బాలికలకు వివిధ సామాజిక అంశాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో, మంగళవారం రాహుల్ విజ్ఞాన్ పాఠశాలలో ప్రత్యేక సదస్సులు నిర్వహించారు. చర్ల గర్ల్స్ హై స్కూల్ లో కిషోర బాలికల కోసం నిర్వహించిన అవగాహన సదస్సులో చర్ల ఎస్.ఐ నర్సిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సాంకేతిక యుగంలో పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సామాజిక మాధ్యమాల వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఐ.సి.డి.ఎస్ సిబ్బంది పాల్గొని బాలికల రక్షణ ఆరోగ్యంపై అవగాహన కల్పించారు.మంగళవారం రాహుల్ విజ్ఞాన్ పాఠశాలలో బాల్య వివాహాలు, బాలికల అపహరణ అనే అంశాలపై అవగాహన సదస్సులో ఎం.పి.డి.ఓ ఈదయ్య మాట్లాడుతూ చిన్న వయసులో పెళ్లిళ్లు చేయడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఈదయ్య , ఎస్.ఐ నర్సిరెడ్డి , ఎం.ఈ.ఓ రమణ, ఏ.పి.ఎం, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



